# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 08-02-2016**

రాజేంద్రనగర్ మండలం బుద్వేల్ పరిధిలోని దాదాపు వంద ఎకరాల విస్తీర్ణంలో హైదరాబాద్ జర్నలిస్టుల కోసం నివాస గృహాల సముదాయాలు నిర్మించనున్నట్లు ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు వెల్లడించారు. నగరంలో పనిచేసే అన్ని రకాల జర్నలిస్టులకూ గృహాలు సమకూరేలా బహుళ అంతస్తుల టవర్స్ నిర్మిస్తామని చెప్పారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, నాయకులు శ్రీనివాసరెడ్డి, అమర్, పల్లె రవి, క్రాంతి, విరాహత్ అలీ, పివి. శ్రీనివాస్, నాగేశ్వర్ రావు, రమేష్ హజారి, బుద్దా మురళీ, సతీష్, శైలేష్‌రెడ్డి తదితరులతో సమావేశమై చర్చించారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు నగరంలోని పలు ప్రభుత్వ స్థలాలను పరిశీలించి వచ్చిన జర్నలిస్టులు బుద్వేల్ ప్రాంతంలోని స్థలం ఇండ్ల నిర్మాణానికి, రవాణా సదుపాయాలకు అనువుగా వుందని నిర్ణయించారు. జర్నలిస్టుల అభీష్టం మేరకు బుద్వేల్ లోనే ఇండ్ల నిర్మాణం చేపడతామని సిఎం ప్రకటించారు. బుద్వేల్‌లోని స్థలం ప్రస్తుతం గ్రామీణాభివృద్ధి శాఖ ఆధీనంలో వుందని, దానిని తిరిగి ప్రభుత్వానికి బదలాయించాలని పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి ఎస్.పి.సింగ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ అనితారాంచంద్రన్‌ను సిఎం ఆదేశించారు. జర్నలిస్టుల ఇండ్ల నిర్మాణ కార్యక్రమాన్ని సమన్వయం చేయాల్సిందిగా రంగారెడ్డి కలెక్టర్ రఘునందన్‌రావుకు సూచించారు.

జర్నలిస్టులలో ఎక్కువ మంది దిగువ, మధ్య తరగతికి చెందిన వారేనని, వారికి సొంత ఇండ్లు కూడా లేవని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులందరికీ దశల వారీగా ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించారు. మీడియాలో పనిచేసే అన్ని విభాగాల జర్నలిస్టులకు ఇండ్లు ఇస్తామని కేవలం ఇండ్లే కాకుండా, హౌజింగ్ టవర్లలో ఇతర పౌర సదుపాయాలు కల్పిస్తామని సిఎం వెల్లడించారు. రాష్ట్రంలోని జర్నలిస్టులంతా మెరుగైన జీవితం గడపాలన్నదే తమ లక్ష్యమన్నారు. హైదరాబాద్, వరంగల్ నగరాల్లో మొదటి విడతలో ఇండ్లు కడతామని, ఇతర ప్రాంతాల్లోని జర్నలిస్టులకూ ఇండ్లు కట్టిస్తామని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోనూ

జర్నలిస్టులకు ఇండ్లు కట్టే విషయంలో మంత్రులు, కలెక్టర్లకు సూచనలు ఇస్తామని ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా వున్న పార్టటైమ్ రిపోర్టర్లందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకంలో భాగంగా గృహాలు కట్టిస్తామన్నారు.

**సిపిఆర్ఓ టు సిఎం**